సెట్‌బ్యాక్ లేకుండానే నిర్మాణాలు

- అధికారుల ప్రేక్షక పాత్రపై అనుమానాలు
- పలు చోట్ల రోడ్లు ఆక్రమించి మరీ నిర్మాణాలు
- నిబంధనల పేరిట సామాన్యులకు ఇబ్బందులు


9 వ వార్డులో అడ్డదిడ్డంగా నిర్మించిన డ్రైయినేజీ


చిలుకవాడలో డ్రైయినేజీ దాటి నిర్మిస్తున్న ఇల్లు


వినాయకనగర్‌లో సెట్ బ్యాక్ లేక నిర్మించిన ఇల్లు

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రం జగిత్యాల బల్దియాలో అక్రమ నిర్మాణాలు ఆగడం లేదు. టీఎస్ బీపాస్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నా బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో పట్టణంలోని పలువార్డుల్లో సెట్ బ్యాక్ లేని నిర్మాణాలు యథేచ్ఛగా సాగడంతో రోడ్లు ఇరుకుగా మారి రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. జిల్లా కేంద్రంగా మారిన జగిత్యాల బల్దియాలో 48 వార్డులుండగా పలు చోట్ల సెట్ బ్యాక్ లేని నిర్మాణాలతో పాటు రోడ్లను సైతం ఆక్రమించుకుని నిర్మాణాలు చేస్తున్నా అధికారుల ప్రేక్షక పాత్ర వహించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

పట్టణంలోని పలు చోట్ల జరుగుతున్న ఇళ్ల నిర్మాణంలో టీఎస్‌బీపాస్ నిబంధనలకు విరుద్ధంగా, అనుమతికి పూర్తి భిన్నంగా నిర్మాణాలు చేస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇంటి నిర్మాణ సమయంలో అనుమతికి సమర్పించిన ప్లాన్ ఒకటి కాగా, నిర్మాణం మరోలా ఉన్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. క్షేత్ర స్థాయిలో నిర్మాణాలను పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయనే విమర్శలున్నాయి.

సామాన్యులకే నిబంధనలు

ప్రజాప్రతినిధులు, వారి అనుయాయులకు బల్దియా అధికారులు అనుకూలంగా వ్యవహరిస్తున్న విమర్శలున్నాయి. ఎలాంటి అండలేని సామాన్యులను మాత్రం రూల్స్ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న అధికారులు

పట్టణంలోని 9వ వార్డు వినాయకనగర్‌లో ప్రైవేట్ వ్యక్తులకు లబ్ధి చేకూర్చేలా డ్రెయినేజీ నిర్మాణం చేశారనే ఆరోపణలున్నాయి. ప్రైవేట్ వ్యక్తుల ప్లాట్‌ల వద్ద ఎలాంటి సెట్ బ్యాక్ లేకుండా రోడ్డుపైకి జరిగి డ్రెయినేజీ నిర్మించడంతో 33 ఫీట్లు ఉండాల్సిన రోడ్డు 25 ఫీట్లకు చేరి ఇరుకుగా మారిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పలువురు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడం విశేషం.

తూతూ మంత్రంగా కూల్చివేతలు..

అక్రమ నిర్మాణాల పేరిట జరుగుతున్న కూల్చివేతలు ప్రహసనంగా మారుతున్నాయి. అక్కడక్కడ సెట్ బ్యాక్ లేని నిర్మాణాలను తొలగిస్తున్న అధికారులు తిరిగి అదే స్థితిలో నిర్మించుకునేందుకు అనుమతిస్తుండటం అనుమానాలకు తావిచ్చేలా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

నిబంధనలు అమలు చేయాలి



పట్టణంలో టీఎస్‌బీపాస్ నిబంధనల మేరకు నిర్మాణాలు జరగడం లేదు. అక్రమ నిర్మాణాలతో పలువురు రోడ్లు ఆక్రమించుకుంటుండంతో రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. అనుమతులు మంజూరు చేస్తున్న అధికారులు నిబంధనల మేరకు నిర్మాణం జరిగే చూడాలి.

– భూమి రమణకుమార్, న్యాయవాది

చర్యలు తీసుకుంటాం



కొత్త మున్సిపల్ చట్టం ప్రకారం నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలుంటాయి. నిబంధనల మేరకే ఇంటి నిర్మాణం చేపట్టాలి. కొంత మంది అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు మా దృష్టికి వచ్చింది. పరిశీలించి నోటీసులు జారీ చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

– అనిల్‌బాబు, మున్సిపల్ కమిషనర్, జగిత్యాల

అంబేడ్కర్‌కు ఊరూరా నివాళి


నివాళి అర్పిస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాలరూరల్/జగిత్యాలఅగ్రికల్చర్/జగిత్యాలజోన్/ ఇబ్రహీంపట్నం/కథలాపూర్/మల్యాల/కోరుట్ల/కోరుట్ల రూరల్/ మల్లాపూర్/ రాయికల్/మెట్‌పల్లి/ మెట్‌పల్లి రూరల్/ సారంగాపూర్/ధర్మపురి/ ఇబ్రహీంపట్నం /గొల్లపల్లి/పెగడపల్లి: అంబేడ్కర్ జీవితం ప్రతీ పౌరుడికి ఆదర్శం కావాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు నివాళులు అర్పించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పార్టీల కార్యాలయాలు, వివిధ పట్టణాలు, మండల కేంద్రాలు,గ్రామాల్లో దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు నివాళి అర్పించారు. జగిత్యాల బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులు, పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తలు, అధ్యాపకలు అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళి అర్పించారు.


రాయికల్‌లో నివాళి అర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్, ఏఎంసీ చైర్మన్


పొలాసలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న శాస్త్రవేత్తలు


జగిత్యాల రూరల్: తిప్పన్నపేటలో నివాళి అర్పిస్తున్న నాయకులు


ఇబ్రహీంపట్నంలో కొవ్వొత్తులతో నివాళి..


కథలాపూర్: భూషణరావుపేటలో సర్పంచ్, నాయకుల నివాళి


ధర్మపురిలో..


పెగడపల్లిలో..


మల్యాలలో నాయకుల నివాళి..

గ్రామాల అభివృద్ధికి కృషి


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సాతారం గ్రామస్తులు

మల్లాపూర్: గ్రామాల్లో సంపూర్ణ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని సాతారం గ్రామస్తులు బుధవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఆదరించిన ప్రజలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎల్లావేళల మీ మధ్యనే ఉంటూ ప్రతి సమస్యను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు బొడ్డు రాజేశ్, నాయకులు గంగాధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

టీఆర్టీఎఫ్ సంఘం మండల కార్యవర్గం ఎన్నిక

మల్లాపూర్: రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టీఆర్టీఎఫ్) మండల అధ్యక్షుడిగా గుర్రం రాజు, ప్రధాన కార్యదర్శిగా మద్దెల రాజారత్నంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు టీఆర్టీఎఫ్ సంఘం సభ్యులు తెలిపారు. బుధవారం మండల కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా కౌన్సిలర్లుగా జంగ గంగాధర్, కుంట భూమేశ్వర్, నేరెళ్ల ప్రశాంత్, సాతాల నర్సయ్య, విజగిరి మహిపాల్, రామన్, అసోసియేట్ అధ్యక్షుడిగా తోట లింగన్న, ఉపాధ్యక్షులుగా మొబిన్, గోవర్ధన్, కీర్తి, ఆదనపు ప్రధాన కార్యదర్శిగా నలిన్‌కుమార్, కార్యదర్శులుగా రాజశేఖర్, అంజనేయులు, శారదను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, నిలిచిపోయిన ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని కోరారు.

క్లుప్తంగా

జాతీయ సాహస శిబిరానికి కోరుట్ల విద్యార్థి


విద్యార్థితో కళాశాల యాజమాన్యం

కోరుట్ల: జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ సాహస శిబిరానికి పట్టణానికి చెందిన రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థి, ఎస్‌ఎస్‌ఎస్ వలంటీర్ యాగండ్ల వికాస్ ఎంపికయ్యాడు. ఈ నెల 30 హిమాచల్ ప్రదేశ్‌లోని నర్కొండలో నిర్వహించే నేషనల్ అడ్వెంచర్ లో శాతవాహన యూనివర్సిటీ కరీంనగర్ తరఫున యంగండ్ల వికాస్ పాల్గొంటాడు. వారం రోజుల పాటు ఈ శిబిరం నిర్వహిస్తారని ఎస్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కొప్పెల భూమారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థిని వికాస్‌ను కళాశాల కరస్పాండెంట్ యాద రామకృష్ణ, డైరెక్టర్ హరిప్రియ, ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు అభినందించారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి


మాట్లాడుతున్న హెల్త్ సూపర్‌వైజర్ ఉష

ఇబ్రహీంపట్నం: గర్భిణులు, బాలింతలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్ ఉష తెలిపారు. బుధవారం మండలంలోని వర్షకొండలో అంగన్‌వాడీ కేంద్రాలలో విలేజ్ హెల్త్ న్యూట్రిషన్ డే, టిక్ హోమ్‌రేషన్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పారిశుభ్రత పాటిస్తూ ప్రతి రోజు తీసుకోవాల్సిన పౌష్టిహాకారం గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు మాదవి, భవాని, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ


సరుకులు అందిస్తున్న సేవా సంస్థ సభ్యులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ధర్మపురిలోని మూడు నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ధర్మపురి మున్సిపల్ పరిధిలోని హన్మాన్‌వాడకు చెందిన కట్ట తిరుపతి, బోయవాడకు చెందిన కలమడుగు లచ్చన్న, కమలాపూర్ చౌరస్తాలో ఉంటున్న బడుగు రాజమ్మ కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 వేల విలువ గల నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రంగు లక్ష్మీ నరహరి, పప్పుల శ్రీనివాస్, రంగ హరినాథ్, చాడ శ్రీనివాస్ మాదవీలత, రమాదేవి తదితరులున్నారు.

ముత్యంపేటలో ఉచిత వైద్య శిబిరం


వైద్య శిబిరంలో సిబ్బంది, సర్పంచ్

మల్యాల: మండలంలోని ముత్యంపేటలో బుధవారం సన్‌షైన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ అపూర్వ, వైద్య సిబ్బంది, సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

46,600 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు



సారంగాపూర్: మండల కేంద్రంలోని సహకార సంఘ పరిధిలో ధాన్యం కొనుగోళ్లలో ఇప్పటి వరకు 46,600 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు సంఘం బాధ్యులు తెలిపారు. సంఘ పరిధిలోని పది కేంద్రాల్లో కొనుగోళ్లు కొనసాగుతున్నాయని సంఘ సిబ్బంది శివ, భూమేశ్ పేర్కొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలి


స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో భూమయ్య

మల్లాపూర్: విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలను పెంచి ప్రాథమిక విద్య బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల నోడల్ అధికారి కేతిరి దామోదర్‌రెడ్డి అన్నారు.మండలంలోని రాఘవపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రైవేట్ కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే సకల వసతులు, సుశిక్షితులైన ఉపాధ్యాయులచే బోధన జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులకు ఎప్పటికప్పుడు నూతన విధానాలతో శిక్షలిస్తూ విద్యార్థులకు పాఠ్యపుస్తకములతో పాటు వర్క్‌బుక్స్‌ను ప్రభుత్వం ఉచితంగానే పంపిణి చేయడంతో నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నామన్నారు. 3 ఆర్స్ నేర్పించేందుకు మెళకువలు వివరించామన్నారు. సమావేశంలో రిసోర్స్ పర్సన్ కిరణ్, రాజేశ్, సీఆర్పీలు దేవరెడ్డి, మహేష్‌లతో పాటు 39మంది ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపునకే స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్‌లు

బుగ్గారం: ఉపాధ్యాయుల్లో బోధనానైపుణ్యాలను మరింతగా మెరుగుపరచుకునేందుకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఉపయోగపడతాయని ఎంఈవో బత్తుల భూమయ్య అన్నారు.ఈ మేరకు బుగ్గారం మండల కేంద్రంలో బుధవారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్‌లో ఆయన పాల్గొని ఉపాధ్యాయులకు పలు సలహాలు,సూచనలు చేశారు.ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో కనీస సామర్థ్యాల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రాథమిక స్థాయిలో నాణ్యమైన విద్యనందించి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు.కార్యక్రమంలో వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

జీవన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి


మాట్లాడుతున్న మనోహర్

గొల్లపల్లి: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని ధర్మపురి నియోజకవర్గ వైస్ ప్రెసిడెంట్ శ్రీపాతుల మనోహర్ అన్నారు. మండలంలోని రాఘవపట్నంలో బుధవారం మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు, అనుభవం గల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డికి ఇస్తే జగిత్యాల జిల్లాతో పాటు చుట్టూ ఉన్న నియోజకవర్గాలు అభివృద్ధి చేస్తారని అన్నారు. సమావేశంలో రాఘవపట్నం కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు కొలకాని అశోక్, యూత్ మండల ఉపాధ్యక్షుడు మతులాపురం జలెందర్, రాజు, శేఖర్, మధు, రాజేశ్, రమేశ్ ఉన్నారు.

పేదింటి పెళ్లికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందిస్తున్న వేముల సుభాష్

బుగ్గారం: మండల కేంద్రానికి ఓ నిరుపేద కుటుంబంలో జరుగుతున్న వివాహానికి తన వంతుగా ఆర్థికసాయం చేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేముల సుభాష్. బుగ్గారం గ్రామానికి చెందిన కొడిమ్యాల రాజేశ్–జమున దంపతుల కూతురుకు ఇటీవలే వివాహం నిశ్చయం అయింది. ఈ క్రమంలో వారి ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో స్థానిక నాయకుల ద్వారా వారి పరిస్థితి తెలుసుకున్న వేముల సుభాష్ తన వంతు సాయంగా రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై వివరాల సేకరణ



కథలాపూర్: జిల్లాలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల, రిజర్వేషన్ వివరాలు సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. 2006, 2013, 2019 సంవత్సరాల్లో జరిగిన పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో అమలు చేసిన రిజర్వేషన్లు, అప్పటి ప్రజాప్రతినిధుల వివరాలు సమర్పించాలని ఎంపీడీవోలకు జిల్లా అధికారులు సూచించారు. వివరాల కోసం జిల్లా అధికారులు మంగళవారం సాయంత్రం జూమ్ మీటింగ్ ద్వారా అవగాహన కల్పించారు. జిల్లాలో 20 మండలాలు, 380 గ్రామపంచాయతీలున్నాయి. ప్రతీ గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్‌తోపాటు వార్డు సభ్యులుంటారు. ఈ క్రమంలో 380 మంది సర్పంచులు, 3,500 మంది వార్డుసభ్యుల వివరాలు సేకరిస్తున్నారు. ఇవే కాకుండా జెడ్పీటీసీ, ఎంపీటీసీల వివరాలు సేకరించే పనిలో అధికారులు ఉన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల, రిజర్వేషన్ల వివరాలు అధికారులు సేకరిస్తుండటంతో త్వరలోనే గ్రామపంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహిస్తారని గ్రామాల్లో నాయకులు, ప్రజలు చర్చించుకోవడం విశేషం.

ముసురు వర్షం.. రైతులకు కష్టం


ధాన్యం కుప్పలపై నీటిని తొలగిస్తున్న రైతు

కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో బుధవారం ముసురు వర్షం కురియడంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం కురియగానే రైతులు అప్రమత్తమై ధాన్యం కుప్పలపై టార్పాలిన్ కవర్లు కప్పారు. అయినప్పటికీ ధాన్యం కుప్పలు అడుగుభాగం తడిసినట్లు పలువురు రైతులు తెలిపారు.